లక్ష్మణరావును గెలిపించుకోవాలి

టీచర్లకు యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, పట్టభద్రులపై ఉందని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.బాబురెడ్డి పిలుపునిచ్చారు. కృష్ణా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం రాత్రి యుటిఎఫ్ గన్నవరం, ఉంగుటూరు మండలాల విస్తృత సమావేశం జరిగింది. దీనికి ఆ సంఘం నాయకులు పి.ప్రసాదరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బాబురెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలపైనా ప్రభుత్వాన్ని నిలదీయడంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కీలక పాత్ర పోషించారని తెలిపారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కెఎస్.లక్ష్మణరావును గెలిపించుకోడానికి ఉపాధ్యాయులంతా కృషి చేయాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నాయకులు మరీదు వరప్రసాద్, రాజబాబు, భగీరథి, శివప్రసాద్, శంకరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

9వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒంగోలులో బుధవారం 3కె రన్ నిర్వహించారు. స్థానిక ఎబిఎం జూనియర్ కళాశాల ప్రాంగణం వద్ద సంయుక్త కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి జెండా ఊపి ప్రారంభించారు.

ఆధునిక క్షేత్రీయ ప్రయోగశాల ప్రారంభం

ప్రజాశక్తి- మాధవధార, విశాఖ

స్థానిక మాధవధార ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి జోనల్ కార్యాలయంలో నవీకరించిన క్షేత్రీయ ప్రయోగశాలను రాష్ట్ర పర్యావరణ, అటవీ శాఖా మంత్రి శిద్దా రాఘవరావు బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి గంటా శ్రీనివాసరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. ప్రయోగశాలలో అత్యాధునిక పరికరాల ఏర్పాటుకు ప్రపంచబ్యాంకు రూ.20 కోట్ల సాయం అందించిందని తెలిపారు. ఆ నిధులతో రూ.15 కోట్ల వ్యయంతో వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌ను, రూ.2.5 కోట్ల వ్యయంతో రెండు మొబైల్ టెస్టింగ్ ల్యాబ్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు. జల, వాయు, పర్యావరణ చట్టాలను అమలు పరచే క్రమంలో ప్రయోగశాల ప్రాముఖ్యత ఎంతో ఉందని చెప్పారు. విశాఖపట్నం స్మార్ట్ సిటీ కావడంతో ఎన్నో పరిశ్రమలు తరలి వస్తున్నాయన్నారు. అయితే వాటి నుంచి వెలువడే కాలుష్యాన్ని నిర్ధారించేందుకు, అరికట్టేందుకు ప్రయోగశాల, సంచార ప్రయోగశాలలు దోహదపడతాయని తెలిపారు.

మూడేళ్లలో అన్ని గృహాలకూ

కృష్ణాలో 'మెఘ' గ్యాస్

పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా

ఇప్పటికే జిల్లాలో వెయ్యి కనెక్షన్‌లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

పైప్‌లైన్‌ల ద్వారా వంట గ్యాస్ సరఫరా ప్రక్రియ కృష్ణా జిల్లాలో ప్రారంభమైంది. మెఘ ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (మెయిల్) ఇప్పటికే పలు ప్రాంతాల్లో వెయ్యి కనెక్షన్‌లకు ఈ విధానంలో గ్యాస్ సరఫరా చేస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాంతాలకూ పూర్తి స్థాయిలో గ్యాస్ సరఫరా చేయడానికి మెయిల్ ప్రణాళిక రూపొం దించింది. సాధారణ గ్యాస్‌తో పోల్చుకున్న పుడు ఈ పద్ధతిలో వినియోగదారులకు 40 శాతం వ్యయం ఆదా అవుతుందని మెయిల్ ప్రతినిధులు వివరిం చారు. విజయవాడ నగర పాలక సంస్థ మినహా జిల్లాలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్‌లో మెయిల్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం ఐదు సంవత్సరాల్లో జిల్లాలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేయాలి. దీనిలో భాగంగా ఆగిరిపల్లిలో రెండు గ్యాస్ బంకులు (శాటిలైట్ స్టేషన్)లను ఇప్పటికే వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చింది. కంకిపాడు వరకూ గ్యాస్ పైప్‌లైన్ నిర్మాణం పూర్తి చేసింది. నూజివీడు, ఆగిరిపల్లి, నున్న గన్నవరం ప్రాంతాల్లో కొన్ని గృహాలకు, వాణిజ్య సంస్థలకు పైప్‌లైన్ ద్వారా 1000 కనెక్షన్‌లకు గ్యాస్ సరఫరా చేస్తోంది. ఈ ప్రాంతంలో మరో 30 వేల గృహాలకు ఈ ఏడాది చివరకు పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు ప్రణాళిక రూపొం దించింది. గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ, ముదినేపల్లి తదితర ప్రాంతాల్లో పైప్‌లైన్‌లను ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసింది.

డోకిపర్రులో గ్యాస్ పైప్‌లైన్ ప్లాంట్ ఇన్‌సెట్లో ప్రారంభిస్తున్న మెయిల్ చైర్మన్ పిచ్చిరెడ్డి

డోకిపర్రులో కనెక్షన్లు

మెయిల్ చైర్మన్ పామిరెడ్డి పిచ్చిరెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి తమ స్వగ్రామమైన గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులో ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా కార్యక్రమాన్ని ఇటీవల ప్రారంభించారు. ఈ గ్రామంలో మొత్తం 1500 గృహాలకు గ్యాస్ సరఫరాకు అనువుగా 20 కిలోమీటర్ల మేర పైప్‌లైన్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 125 గృహాలకు కనెక్షన్‌లిచ్చారు. 225 గృహాల వారు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో కనెక్షన్‌లు ఇవ్వనున్నారు. కంకిపాడు వరకూ ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా భారీ సిలెండర్‌లను నింపుతున్నారు. అక్కడ నుండి లారీల ద్వారా సిలెండర్‌లను తీసుకు వచ్చి డోకిపర్రులోని పైప్‌లైన్‌కు అనుసంధానం చేసి గ్యాస్ సరఫరా చేస్తోంది. అయితే త్వరలో ఈ పైప్‌లైన్‌ను డోకిపర్రు వరకూ తీసుకు రానున్నట్లు మెయిల్ ప్రతినిధులు చెబుతున్నారు.

డిపాజిట్ భారం కాకుండా..

పైప్‌లైన్ ద్వారా సరఫరా అయ్యే గ్యాస్ కనెక్షన్ తీసు కునేందుకు సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ. 4,500, రిజి స్ట్రేషన్ ఫీజు మరో రూ. 500 చెల్లించాలి. బిపిఎల్ కేట గిరిలో తెల్లకార్డు కలిగి ఉన్న వారికి మాత్రం డిపాజిట్‌లో రూ.2 వేల వరకూ రాయితీ కల్పించారు. రూ.3 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అలాగే వినియోగదారులకు భారం కాకుండా నెలవారీ బిల్లుతో పాటు దశల వారీగా డిపాజిట్‌ను చెల్లించేందుకు వెసులుబాటు కల్పించారు.

ప్రమాద రహితం..పర్యావరణ హితం

మెయిల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్

పెట్రోలియం నేచురల్ గ్యాస్ రెగ్యులేటరీ బోర్డు (పిఎన్‌జిఆర్‌బి) నిబంధనలకనుగుణంగా పైప్‌లైన్ ఏర్పాట్లు జరుగుతున్నాయనీ, ఇది పూర్తిగా ప్రమాదరహితం, పర్యావరణ సహితమని మెయిల్ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజ్‌కుమార్ ప్రజాశక్తికి వివరించారు. పిఎన్‌జిఆర్‌బి సర్టిఫై చేసిన సంస్థల వద్దే పైప్‌లు, అవసరమైన పరికరాలు కొనుగోలు జరుగుతోంది. 5 అడుగుల లోతులో పైప్‌లైన్‌లను ఏర్పాటు చేస్తున్నాం. గృహాలతోపాటు, వ్యాపార , పారిశ్రామిక అవసరాలకు పిఎన్‌జి కనెక్షన్ కోరుతూ దరఖాస్తు చేశారు. ఎల్‌పిజితో పోల్చుకున్నప్పుడు 40 శాతం వ్యయం ఆదా అవుతుంది. వీటికి తోడు గ్యాస్ బుక్ చేయడం , సకాలంలో వస్తుందో రాదో అనే టెన్షన్, గ్యాస్ ఇంటికి చేర్చేందుకు కిరాయి సమస్యలుండవు. పిఎన్‌జి వినియోగాన్ని లెక్కించేందుకు కనెక్షన్ ఇచ్చే ప్రతి ప్రాంతంలోనూ మీటర్ ఏర్పాటు చేస్తాం. వినియోగాన్ని అనుసరించి రీడింగ్ ఉంటుంది. ఇప్పటికి రోజువారీ 14 వేల స్టాండర్డ్ క్యూబిక్ మీటర్లు (ఎన్‌సిఎం) వినియోగం జరుగుతోంది. వినియోగాన్ని లక్ష ఎన్‌సిఎం వరకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.. సబ్సిడీపై సరఫరా అయ్యే సిఎన్‌జి కన్నా కూడా పిఎన్‌జి తక్కువ ధరకే అందించడం జరుగుతోంది. ఒక క్యూబిక్ మీటరు పిఎన్‌జిని సగటున రూ.25లకు అందిస్తున్నాం. ఎల్‌పిజి కమర్షియల్, సబ్సిడీ గ్యాస్ వినియోగదారులు రూ. 46 వరకూ ఖర్చవుతుంది. సబ్సిడీ గ్యాస్‌కన్నా కూడా తక్కువ ధరకే అందించడం జరుగుతోందని రాజ్‌కుమార్ వివరించారు.

కాపుల సంక్షేమానికి

ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి గంటా

5న చిట్టివలస జూట్ మిల్లుపై చర్చలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

కాపులను బిసిల్లో చేర్చేందుకు టిడిపి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ప్రభుత్వ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రకటించిన అగ్రవర్ణ పేదల పది శాతం రిజర్వేషన్లలో ఐదు శాతం కాపులకు కేటాయించడం అభినందనీయమన్నారు. కాపుల సంక్షేమం కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లు కేటాయించడం, కాపు విద్యార్థులకు విదేశీ చదువులకు అర్హులైనవారికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందించడం, నిరుద్యోగ యువతకు రూ.3100 కోట్లు కేటాయించడం, కాపులను బీసీలలో చేర్చేందుకు మంజునాథ కమిషన్ ఏర్పాటు చేయడం, వంటి విషయాల్లో కాపు సంక్షేమానికి ముఖ్యమంత్రి కృషి చేశారని గుర్తు చేశారు. విశాఖలో కాపు సామాజికవర్గానికి రీజనల్ కాపు భవన్‌కు ఫిబ్రవరి 10వ తేదీలోగా శంకుస్థాపన చేస్తామని, భవనానికి రూ.5 కోట్లు మంజూరైందని తెలిపారు. చిట్టివలస జూట్ మిల్లు సమస్యపై ఈ నెల 5న మరోసారి అమరావతిలో కార్మిక సంఘాల నేతలతో చర్చలు జరుపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉదయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

జగన్ హత్య కేసులో లోకేష్ హస్తం

వైసిపి నేత బొత్స సత్యనారాయణ ఆరోపణ

ప్రజాశక్తి- మద్దిలపాలెం, విశాఖ

ప్రతిపక్ష నాయకుడు జగన్మోహన్‌రెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి తనయుడు లోకేష్, పోలీస్ ఉన్నతాధికారులకు భాగస్వామ్యం ఉందని వైసిపి సీనియర్ నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. బుధవారం వైసిపి నగర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హత్యాయత్నం జరిగిన కొన్ని గంటల్లోనే డిజిపి ప్రెస్‌మీట్ పెట్టి హత్యాయత్నం ప్రచారం కోసమేనని చెప్పడం వెనుక పలు అనుమానాలు ఉన్నాయని వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకునిపై జరిగిన హత్యాయత్నాన్ని ముఖ్యమంత్రి ఖండించకపోవడం, సిట్ దర్యాప్తు వేయడం పలు అనుమానాలకు దారితీస్తుందని తెలిపారు. కోర్టు సూచనల ప్రకారం కేంద్రం ఎన్ఐఎ దర్యాప్తు వేసిందని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించడం లేదని పేర్కొన్నారు. వాళ్ల భాగస్వామ్యం లేకపోతే ఎన్ఐఎ దర్యాప్తును ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు.

సినీనటి భానుప్రియ ఇంట్లో బాలిక నిర్బంధం

సామర్లకోట పోలీసులకు బాలిక తల్లి ఫిర్యాదు

ప్రజాశక్తి - సామర్లకోట (తూర్పుగోదావరి)

ప్రముఖ సినీ నటి భానుప్రియ ఇంట్లో తమ కుమార్తె నిర్బంధంలో ఉందని బాధిత బాలిక తల్లి పెనుపాకల ప్రభావతి సామర్లకోట పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. ఆమె కథనం మేరకు.. సామర్లకోట మండలం పండ్రవాడకు చెందిన పెనుపాకల ప్రభావతి కుమార్తె సంధ్య(15) చెన్నైలోని సినీనటి భానుప్రియ ఇంట్లో ఏడాది కాలంగా పనిచేస్తోంది. భానుప్రియ అన్న గోపాలకృష్ణ సంధ్యను లైంగికంగా వేధిస్తున్నాడు. ఈ విషయం ఆ బాలిక ఫోన్‌లో తన తల్లి ప్రభావతికి చెప్పింది. చెన్నై వెళ్లిన ఆమె తన కుమార్తెను పంపాలని కోరింది. భానుప్రియ అన్న 'మీ అమ్మాయిని ఎప్పుడో పంపించేశాము. నీ దిక్కున్న చోట చెప్పుకో' అని గెంటేశారు. దొంగతనం కేసు మోపి సంధ్యను ఇబ్బందులకు గురి చేస్తామని బెదిరించాడు. దీంతో బాలిక తల్లి ప్రభావతి కాకినాడ 1098 చైల్డ్ లైన్ సంస్థను ఆశ్రయించింది. ఆ సంస్థకు చెందిన ప్రతినిధి జి.విజయ్‌కుమార్ సాయంతో సామర్లకోట ఎస్ఐ శ్రీను నాయక్‌కు ఫిర్యాదు చేసింది. తమ కుమార్తెను వేధింపుల నుంచి కాపాడి తమకు అప్పగించాలని కోరింది.

గన్నవరం ఘటనలో ఓ యువకుడు మృతి

ప్రజాశక్తి - గన్నవరం

కృష్ణాజిల్లా గన్నవరం పోలీసు స్టేషన్ వద్ద ఎలుకల మందు తిన్న ఇద్దరు యువకుల్లో ఒకరు బుధవారం తెల్లవారుజామున చిన ఆవుటపల్లి ఆసుపత్రిలో మృతి చెందాడు. బుద్ధవరం శివారు రాజీవ్‌కాలనీలో యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో ముద్దరబోయిన కోటేశ్వరరావు (18), రామాంజనేయులు, పవన్‌లపై పోలీసులు కేసు నమోదు చేయగా వారిలో మొదటి ఇద్దరూ ఎలుకల మందు తిని మంగళవారం ఆసుపత్రిలో చేరారు. కోటేశ్వరరావు పరిస్థితి విషమించడంతో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. రామాంజనేయులు పరిస్థితి విషమంగానే ఉందని వైద్యులు చెప్పారన్నారు. కోటేశ్వరరావు మృతితో కాలనీలో గొడవలు జరుగుతాయనే అనుమానంతో సిఐ శ్రీధర్‌కుమార్ పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేసిన యువతి ఇంటి వద్ద పోలీసులు మోహరించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

నౌహీరాకు బెయిల్ తిరస్కరణ

ప్రజాశక్తి-చిత్తూరు నగరం

నౌహీరా బెయిల్ పిటిషన్‌ను చిత్తూరు జిల్లా సెసెన్స్ కోర్టు జడ్జి రవీంద్రబాబు తిరస్కరించారు.

'సీమ'లో కృష్ణమ్మ పరుగులు

- హంద్రీనీవాకు జలహారతి
- బి.కొత్తకోట పరిసరాల్లో పండగ వాతావరణం
- 29 మదనపల్లికి...2కల్లా పుంగనూరుకు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

కల నెరవేరింది.. ఆలస్యంగానైనా కృష్ణాజలాల రాక అన్నదాతలు, ఆ ప్రాంత ప్రజల్లో పండగ వాతావరణం నెలకొల్పింది. ఓవైపు రాజకీయాలకతీతంగా ప్రాజెక్టు పరివాహక ప్రాంతమంతా వందలాదిగా జనం విచ్చేసి పసుపు, కుంకుమ చల్లి కృష్ణాజలాలకు రెండ్రోజులుగా స్వాగతం పలుకుతున్నారు. మంత్రులు, అధికారుల హంగామా అంతా.. ఇంతా... కాదు.. కరువుగడ్డ సస్యశ్యామలం కాబోతుందని, ఇదంతా తమ ఘనతేనని అధికార పార్టీ నేతలు సభలు పెట్టి, జలహారతులు ఇస్తున్నారు. ఇదంతా చంద్రబాబు ఘనతని, కృష్ణాజలాలు జిల్లాకు వచ్చిన రోజు చరిత్రలో నిలిచిపోతుందని కొనియాడుతున్నారు. పెద్దతిప్పసముద్రం చెరువుకు వెళ్లే కాల్వల గేట్లను ఎత్తేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. రెండ్రోజులుగా తన సంతోషానికి అవధుల్లేవని సిఎం స్పందించారు. బుధవారం బి.కొత్తకోట మండలంలోని చెరువుల్లోకి నీరు ప్రవేశించింది. 29కల్లా మదనపల్లికి, రెండో తేదీకల్లా పుంగనూరుకు ఈ నీరు చేరుకోనుంది. ఇది ప్రస్తుతం...

గతం... మూడు దశాబ్దాలుగా భూగర్భజలాలు అడుగంటి వెయ్యి అడుగుల లోతులో బోరు వేసినా నీరు పడని భయానకమైన పరిస్థితి. కనీసం తాగడానికి కూడా నీరు దొరకని దయనీయ స్థితుల్లో పొట్ట కూటి కోసం వలస బతుకులు.. బెంగళూరు, చెన్నై, తిరుపతి ప్రాంతాలకు వలసెళ్లి పండగలప్పుడు సొంతూరుకు వచ్చి పోయే యువతే ఈ ప్రాంతంలో కనిపిస్తుంది.. శివారు జిల్లా అయిన అనంతపురం నుంచి అక్కడి కరువుకు తట్టుకోలేక పశువులు, గొర్రెలు మేపుకునేందుకు కాపరులు ఇక్కడికి వస్తే, ఇక్కడి పేదలు తమ పొట్టకొట్టొద్దంటూ ఆకలి 'పోరాటాలు' సైతం చేశారు... చిత్తూరు జిల్లా పడమటి ప్రాంత రైతులకు హంద్రీనీవా జలాల రాక ఓ సుందర స్వప్నం..

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ హంద్రీ నీవా ప్రాజెక్టుకు 1985లో శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలోని నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద శ్రీశైలం ఉపరిభాగం నుంచి మొదటి ఎత్తిపోతల కేంద్రం ద్వారా ఇది మొదలవుతుంది. దాదాపు 565 కిలోమీటర్ల పొడవుతో చిత్తూరు జిల్లాలోని తిమ్మాపురం నుంచి ఉపకాలువ ద్వారా నీవా నది వరకూ దీనిని ప్రతిపాదించారు. హంద్రీనీవా రెండో దశలో మన జిల్లాకు నీళ్లు వస్తున్నాయి.

బి.కొత్తకోటకు చేరిన హంద్రీనీవా నీటికి స్వాగతం పలుకుతున్న స్థానికులు

మొదటిదశలో 14 శతకోటి ఘనపుటడుగుల నీటిని వినియోగించి కర్నూలు జిల్లాలో 80 వేల ఎకరాలు, అనంతపురం జిల్లాలో 1.18 ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. ఈ నీటిని 292 మీటర్ల ఎత్తుకు సరఫరా చేయనున్నారు. దీనికి 416.92 మెగావాట్ల విద్యుత్ అవసరం. రెండో దశలో 26 శతకోటి ఘనపుటడుగుల నీరు వినియోగించి అనంతపురం జిల్లాలో 2.27 లక్షల ఎకరాలకు, కడప జిల్లాలో 37,500 ఎకరాలకు, చిత్తూరు జిల్లాలో 1.40 లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వనున్నారు. రెండు దశల్లోనూ దాదాపు 30 లక్షల మందికి తాగునీటిని అందించాలని రూపొందించారు. దీనికి 2016లో రూ.7 వేల కోట్లు సవరించిన అంచనాలతో పరిపాలనా అనుమతులిచ్చింది. ఈ జలాల వల్ల తంబళ్లపల్లి, మదనపల్లి, పీలేరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు మేలు చూకూరనుంది.

చిత్తూరు జిల్లా పరిధిలో ప్రాజెక్టు స్వరూపం

ప్రాజెక్టు మొత్తం వ్యయం : రూ.3,137.46 కోట్లు
ఇప్పటికే చేసిన ఖర్చు : రూ.2713.06 కోట్లు
ఇంకా చేయాల్సిన వ్యయం : రూ.560.54 కోట్లు
జిల్లాలో సాగయ్యే ఆయకట్టు: 1,81,400 ఎకరాలు
పంపింగ్ స్టేషన్లకు వాడే విద్యుత్ : 634 మెగావాట్లు
మొత్తం పంపింగ్ స్టేషన్లు : 28

ప్రస్తుతం 150 క్యూసెక్కుల విడుదల

ఈ కృష్ణాజలాలు అనంతపురం జిల్లా జీడిపల్లి వద్ద గల జలాశయం నుంచి 22 కిలోమీటర్లు ప్రయాణించి ఇదే జిల్లాలోని కదిరి వద్ద గల చెర్లోపల్లి రిజర్వాయర్ చేరుతూ వచ్చాయి. 1.425 టిఎంసిల సామర్థ్యం ఉంది. ఇందులో 30 శాతం నీళ్లు నిండిన తర్వాత మూడ్రోజుల క్రితం 150 క్యూసెక్కుల నీటిని కిందికి వదిలారు. ఇవి చిత్తూరు జిల్లాకు ముఖద్వారంగా పిటిఎం వద్ద గల బొంతపల్లికి చేరుకుంది. ఇక్కడున్న చెరువు నిండిన తర్వాత కిందికి వదులుతామని అధికారులు చెబుతున్నారు. తొలుత వేసవి అవసరాలకు తగ్గట్లుగా నీటిని వదలనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం వదిలిన నీటితో పుంగనూరు బ్రాంచి కాల్వకు జలకళ వచ్చింది. ప్రస్తుతానికి పెద్దతిప్పసముద్రం, మదనపల్లి, పుంగనూరు, పలమనేరు ప్రాంతాలకు ఈ నీటిని సరఫరా చేయనున్నారు. తాగునీటి అవసరాలకు, ఉద్యానవన పంటలకు వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సంతోషంగా ఉంది

హంద్రీనీవా నీళ్లు రావడంతో నియోజకవర్గంలోని రైతులు సంతోషంగా ఉన్నారు. హంద్రీనీవా చెరువులు నిండితే రైతు రాజవుతాడు. రైతు బాగుంటేనే దేశం బాగుంటుంది. నీటితో పంటలు సస్యశ్యామలం అవుతాయి.

-కూనపరెడ్డి, శెట్టిపల్లి గ్రామం, బి.కొత్తకోట

ఎన్నో ఏళ్ల కల సాకారం

పడమటి ప్రాంత రైతులకు ఎన్నో ఏళ్ల కల ఇప్పుడు సాకారమైంది. ఎన్‌టిఆర్ హయాంలో పునాదిరాయి పడింది. మళ్లీ అదే ప్రభుత్వ హయాంలో నీరు రావడం ఎంతో ఆనందంగా ఉంది.

-ప్రసాద్, బి.కొత్తకోట

వైసిపి గూటికి మంత్రి సోమిరెడ్డి బావ

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సోదరి భర్త కేతిరెడ్డి రామకోటారెడ్డి వైసిపిలో చేరారు. బుధవారం రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి హైదరాబాద్‌లో జగన్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. తన ఇద్దరు కుమారులతో కలిసి పార్టీలో చేరారు. ప్రసుత్తం టిడిపి ఉపాధ్యక్షులుగా పని చేస్తున్నారు. సోమిరెడ్డి బీద సోదరులకే ప్రాధాన్యత ఇవ్వడంతో రామకోటిరెడ్డి కినుకు వహించారు. ఈ నేపథ్యంలో వైసిపి నేత ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కేతిరెడ్డిని పార్టీలోకి ఆహ్వానించారు. రామకోటారెడ్డి చేరిక వల్ల పార్టీకి ఎటువంటి నష్టం లేదని, ఆయన ప్రభావం కావలిలో ఒక వార్డు స్థాయి మాత్రమే ఉంటుందని టిడిపి నేతలు అంటున్నారు.

మేనేజ్‌మెంట్‌కు తొత్తుగా ప్రభుత్వం : సిఐటియు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

చిట్టివలస జూట్ మిల్లు సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం ఆ యాజమాన్యానికి తొత్తుగా వ్యవహరిస్తుందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు ఎద్దేవా చేశారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో చిట్టివలస మిల్లు యూనియన్ గౌరవాధ్యక్షులు ఆర్ఎస్ఎన్.మూర్తి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నర్సింగరావు మాట్లాడారు. ఈ నెల 22న అమరావతిలో మంత్రులు, జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ సమక్షంలో జరిగిన సమావేశంలో యాజమాన్య వాదనలనే వినిపించడానికి మంత్రి పితాని సత్య నారాయణ ప్రయత్నం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. మిల్లు మూసేసిన పదేళ్ల కాలానికి 3 నెలల జీతం నష్టపరిహారాన్ని మూడు వాయిదాల్లో ఇచ్చి ఫైనల్ సెటిల్‌మెంట్ చేయాలని మంత్రి కోరారన్నారు. అప్రంటీస్ కార్మికులు 2150 మందికి ఎలాంటి సెటిల్‌మెంట్ చేయబోమనడం సరికాదన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో గేయ రచయిత చంద్రబోస్

ప్రజాశక్తి-భీమవరం రూరల్(పశ్చిమగోదావరి)

ప్రముఖ సినీ గేయ రచయిత, గాయకుడు చంద్రబోస్ పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని శ్రీమావుళ్లమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి నల్లం సూర్యచక్రధరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సత్కరించి, అమ్మవారి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా చంద్రబోస్ మాట్లాడుతూ మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని చెప్పారు.

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రనీటి పారుదల అభివృద్ధి సంస్థ
29-36-37, 3వ అంతస్తు, అమ్మన ఎస్టేట్, ప్రకాశం రోడ్, గవర్నర్‌పేట్, విజయవాడ-520 002.
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు నెం. 57/2018-19 తేది: 23-01-2019
పని పేరు : ప్రకాశం జిల్లా, కొండెపి మండలంలోని, మూసీ నదిపై వెన్నూరు-2 ఎత్తిపోతల పథకమును టర్న్‌కీ ప్రాతిపదికన నిర్మించి, కమీషన్ చేసి మరియు రెండు సంవత్సరముల పాటు నిర్వహించుట.
కాంట్రాక్టు అంచనా విలువ : రూ. 140.41 లక్షలు
ఇ-ప్రొక్యూర్‌మెంట్ వెబ్‌సైట్ నుండి టెండరు షెడ్యూల్ తీసుకోవలసిన తేది : 24-01-2019 ఉ॥ 11.00 గంటల నుండి
టెండరు సమర్పించవలసిన తేది : 07-02-2019 సా॥ 4.00 గంటల వరకు
ఆన్‌లైన్ ద్వారా టెండరు స్వీకరించు చివరి తేది : 07-02-2019 సా॥ 4.30 గంటల వరకు
టెండర్లు ఆహ్వానిస్తున్న అధికారి : జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు : 0866-2434577, 2434537.
మిగిలిన వివరములు కొరకు www.apeprocurement.gov.in నందు లేదా జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, APSIDC, విజయవాడ వారి ఆఫీస్ నందు సంప్రదించగలరు. సం/- జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్

MUNICIPAL CORPORATION :: TIRUPATI
The Commissioner, Municipal Corporation, Tirupati invites Tenders on Dt. -01-2019 e-Procurement platform from the "eligible contractors" for the following Works.

IFB Nos	Name of the Work	No of Works	Est amount in Rupees in Lakhs
IFB No: 469 to 566 & Recall Works/ GEN/18-19/To, Date: -01-2019	Desilting of drains, UGD Pipeline, Compound Wall, Bore Wells, Manholes, CC Road, RCC Storm Water drain, Water Tankers, Buildings, Repair and Roof top Solar.	83 Works	1208.89 Lakhs
Total		83 Works	1208.89 Lakhs

*For particulars please contact Municipal Engineers during office working hours (or) see e-Procurement market place : https://tender.eprocurement.gov.in
Sd/- COMMISSIONER
MUNICIPAL